క్లుప్తంగా

181 మంది విద్యార్థులు గైర్హాజరు

వనపర్తి: ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మంగళవారం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలు జరిగాయి. జిల్లాలో మొత్తం 6,263 మంది విద్యార్థులకుగాను 6,082 మంది హాజరుకాగా.. 181 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈఓ మద్దిలేటి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

'పది' విద్యార్థులకు వీడ్కోలు సమావేశం

పెబ్బేర్ రూరల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం 10వ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ వీడ్కోలు సమావేశాన్ని పాఠశాల 9వ తరగతి విద్యార్థులు ఏర్పాటు చేసినట్లు పాఠశాల హెచ్ఎం నాగేందర్‌గౌడ్ తెలిపారు.

వడ్డెరుల సమస్యలు పరిష్కరించాలి

వనపర్తి: జిల్లాలోని వడ్డెరుల సమస్యలు పరిష్కరించాలని, వడ్డె ఓబన్న విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు సహకరించాలని మంగళవారం వడ్డెర సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కె. దేవరాజు, పట్టణ అధ్యక్షుడు గోపాల్, నియోజకవర్గం ఉపాధ్యక్షుడు రామచంద్రయ్య ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మీ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో మన్యం, వెంకటయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల పరిశీలన

పెబ్బేర్ రూరల్: మండలంలోని రాంపూర్ పంచాయతీ పరిధిలో ఉపాధి పనులను ఎంపీడీఓ రవీందర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెంచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినీష్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ పుష్పలత, ఫీల్డ్ అసిస్టెంట్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

హైస్కూళ్లకు 'పది' హాల్‌టికెట్ల అందజేత

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో హైస్కూల్ హెచ్ఎంలకు మంగళవారం ఎంపీడీఓ కోటేశ్వర్, ఎంఈఓ లక్ష్మణ్ నాయక్ పదో తరగతి విద్యార్థులకు సంబంధించిన హాల్ టికెట్లు అందజేశారు. ఈనెల 18వ తేదీ నుంచి నిర్వహించే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ప్రారంభం అవుతున్నాయని, విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా హెచ్ఎంలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీరాములు, సీఆర్పీ గోవింద్, ఎంఐఎస్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే భవిష్యత్

పాన్‌గల్: మండలంలోని అన్నారంతండాలో బడిబయట ఉన్న 6వ తరగతికి చెందిన విద్యార్థి సిద్ధును మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం వారి తల్లిదండ్రులతో మాట్లాడి బడిలో చేర్పించారు. కొంతకాలంగా బడికి గైర్హాజరు అవుతున్న విద్యార్థి ఇంటికి ఉపాధ్యాయులు వెళ్లి చదువు ప్రాముఖ్యత, చదువుకుంటే కలిగే లాభాలు, ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించి క్రమం తప్పకుండా బడికి పంపించేలా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర్‌నాయక్, మాధవచారి పాల్గొన్నారు.

ఎస్పీకి ఫిర్యాదు

చిన్నంబావి: మండల కేంద్రంలో గతేడాది జర్నలిస్టులకు మంజూరైన డబుల్‌బెడ్ రూం ఇళ్లను నిర్మిస్తామని కాంట్రాక్టర్ 20మంది జర్నలిస్టుల నుంచి రూ.కోటి వసూలు చేశాడని బాధిత జర్నలిస్టులు శ్రీనివాస్, శివశంకర్, తిరుపతయ్య, సురేష్, సత్యం, యుగంధర్ ఎస్పీ రక్షితమూర్తికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులకు 20డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరయ్యాయని, అప్పుడు ఉన్న కాంట్రాక్టర్ ప్రభుత్వం నుంచి వచ్చే డబ్బులతో ఇల్లు కట్టలేనని చెప్పడంతో అందరూ కలిసి రూ.కోటి జమ చేసి ఇచ్చామని ఫిర్యాదులో పేర్కొన్నారు.

బీడీ కార్మికుల కూలి పెంచాలి

మదనాపురం: బీడీ కార్మికుల ప్రావిడెంట్ ఫండ్‌లో యజమాని వాటా ఇవ్వాలని, వెయ్యి బీడీలకు కూలి రూ.350 పెంచాలంటూ ఈ నెల 16న చిన్నచింతకుటలో డిమాండ్ నోటీసు సభ నిర్వహిస్తున్నామని తెలంగాణ ప్రగతిశీల బీడీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు ఏ.సామేల్, పి.అరుణ్‌కుమార్ వెల్లడించారు. మంగళవారం మండలంలోని దుప్పల్లిలో రెడ్డి బీడీ ఫ్యాక్టరీ, వస్తాద్ బీడీ ఫ్యాక్టరీలో కార్మికులకు కరపత్రాలు అందజేసి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారని.. కూలి విషయంలో వీరికి, బయటి కార్మికులకు చాలా వ్యత్యాసం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. డిమాండ్ నోటీసు సభకు ప్రతి కార్మికుడు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సామేల్, గోపాలమ్మ, శ్యాంసన్, రాములు, సుల్తాన్, మాసన్న, గోవర్ధన్‌రెడ్డి, రామేశ్వరమ్మ, వెంకటమ్మ, బాలమ్మ, గౌసియా, హన్మంతు, లక్ష్మి, భాగ్యమ్మ, గౌరమ్మ పాల్గొన్నారు.

పని ప్రదేశంలో నీడ ఏది?

- ముదురుతున్న ఎండలు
- 'ఉపాధి' కూలీలకు ఇబ్బందులు
- వసతులు కల్పించాలని వేడుకోలు



తెల్లరాళ్లపల్లితండాలో ఎండకు గొడుగు, పల్లెం నీడన ఉపాధి కూలీలు

పాన్‌గల్: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ఎండల తీవ్రత పెరుగుతున్నా ప్రథమ చికిత్స పెట్టెలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, టెంట్లు, తాగు నీరు అందుబాటులో లేక ఆందోళనకు గురవుతున్నారు. వేసవిలో కల్పించాల్సిన వసతులపై సంబంధిత అధికారులు దృష్టిసారించడం లేదు. ఉపాధిహామీ పనులు చేపడుతున్న ప్రదేశాల్లో గతంలో గుడారాలతో పాటు తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లను అందుబాటులో ఉంచేవారు. వేసవి కాలం దృష్ట్యా పనులు కొనసాగుతున్న ప్రాంతాల్లో నీడ కోసం గ్రీన్ నెట్ షెడ్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఇంతవరకు వాటి ఊసే లేదు. దీంతో కూలీలు ఎండలోనే సేదతీరుతున్నారు. తాగునీటి వసతి లేకపోవడంతో కూలీలే ఉదయం వెంట తెచ్చుకుంటున్నారు. అవీ పూర్తి కాగానే నీటి కోసం కూలీలు అల్లాడుతున్నారు. పనులు చేస్తున్నా సమయంలో గాయాలపాలు కావడంతో పాటు అస్వస్థకు గురైతే అత్యవసర చికిత్స అందించేందుకు ప్రథమ చికిత్స పెట్టెలు అందుబాటులో లేవు. ఉపాధి కూలీలకు ఏళ్లుగా పార, గడ్డపార, తట్టలు అందడం లేదు. దీంతో వాటిని సొంతంగా ఏర్పాటు చేసుకొని పనులకు వెళ్తున్నారు. వంద మస్టర్లు పూర్తి చేసిన కూలీలకు ఎనిమిదేళ్ల క్రితం పరికరాలు అందజేశారు. తిరిగి వాటి ఊసేలేదు.

సక్రమంగా అందని వేతనాలు

ఉపాధి పనులు చేసిన కూలీలకు సక్రమంగా బిల్లులు అందడంలేదు. 15 రోజులకోసారి వేతనాలు అందించాల్సి ఉండగా నెలరోజులు దాటినా వేతనాలు జమ కావడం లేదు. దీంతో కొన్ని గ్రామాల్లో పనులు చేసేందుకు కూలీలు వెనుకంజ వేస్తున్నారు. ఉపాధి సిబ్బంది పనులకు రావాలని కూలీలను కోరినా పట్టించుకోవట్లేదు. జనవరి 15వరకు మాత్రమే కూలీల వేతనాలు వారి ఖాతాల్లో జమ చేశారు.

మండలాల వారీగా..

మండలం	జాబుకార్డులు	కూలీలు
పాన్‌గల్	15,476	8416
చిన్నంబావి	9,969	6773
వీపనగండ్ల	9,676	6381

పనుల వద్ద వసతులు కల్పించాలి



పనులు చేసే ప్రదేశాలల్లో సరైన వసతులు లేక ఎండలో పనులు చేస్తూ ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు మాత్రం పనులు చేసే ప్రదేశాల్లో కూలీలకు ఇబ్బందులు లేకుండా నీడ కోసం టెంటు, తాగునీటి వసతి, ప్రథమ చికిత్స కిట్లు ఏర్పాటు చేయాలని చెబుతున్నా క్షేత్ర స్థాయిలో అమలు కావట్లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– విజయమ్మ, ఉపాధి కూలీ, పాన్‌గల్

అధికారులు చర్యలు తీసుకోవాలి



ఉపాధిహామీ పథకం నిబంధనల మేరకు వేసవిలో పని ప్రదేశంలో కూలీలకు అవసరమైన నీడ, నీటి వసతి, ప్రథమ చికిత్స కిట్లు వంటి వసతులు ఏర్పాటు చేయాలి. కానీ ఆయా నిబంధనలను సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవట్లేదు. దీంతో కూలీలు ఎండలో పనులు చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో కూలీలు పడుతున్న ఇబ్బందులపై అధికారులు స్పందించకుంటే కూలీలతో కలిసి ఆందోళన చేస్తాం.

– కళావతమ్మ, సీపీఐ జిల్లా నాయకురాలు, కేతేపల్లి

సౌకర్యాల కల్పనకు చర్యలు



ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఉపాధిహామీ కూలీలకు పని ప్రదేశాల్లో వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటాం. పని ప్రదేశాల్లో నీడ కోసం టెంట్లు, తాగునీటి వసతులు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చాం.

– కుర్మయ్య, ఏపీఓ, పాన్‌గల్

పెండింగ్ వేతనాలు చెల్లించే వరకు పోరాటం



డీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు

పెబ్బేర్ రూరల్: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలని కోరుతూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీపీఓ రమణమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు మాట్లాడుతూ కార్మికులకు రెగ్యులర్‌గా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాలుగు, ఐదు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయతీ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని, మల్టీపర్పస్ వర్కర్స్ విధానం రద్దు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా, ఇన్స్‌రెన్స్ వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లిస్తున్న మాదిరిగానే పంచాయతీ కార్మికులకు రెగ్యులర్‌గా వేతనాలు చెల్లించాలని, లేనిచో వచ్చే పార్లమెంట్ ఎన్నికలల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశం రాము, పంచాయతీ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ అనుబంధ జిల్లా అధ్యక్షుడు హన్మంతు, జిల్లా కోశాధికారి పుష్ప, జిల్లా నాయకులు హనీఫ్, శ్రీను, దాసు, ఎల్లయ్య, సుగ్రీవుడు, రాము, శివ, అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు, డ్రెయినేజీ వసతులు కల్పించాలి



సమస్యలు పరిశీలిస్తున్న బి.కృష్ణ

పెబ్బేర్ రూరల్: డబుల్ బెడ్రూం ఇళ్ల కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు బి.కృష్ణ అన్నారు. మంగళవారం వనపర్తి పట్టణం సమీపంలోని చిట్యాల రోడ్డులో ఉన్న డబుల్ బెడ్రూం కాలనీని ఆయన సందర్శించారు. కాలనీ మొత్తం కలియ తిరుగుతూ సమస్యలపై ఆరా తీశారు. కాలనీలో మంచినీటి సమస్య, డ్రెయినేజీ, విద్యుత్ దీపాలు, సీసీ రోడ్లు, సెప్టిక్ ట్యాంకు వంటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కాలనీలో తాగు నీటి సౌకర్యం లేక చాలా మంది డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి రావడం లేదని, డ్రెయినేజీ సమస్య పరిష్కారం అయితే లబ్ధిదారులు ఇక్కడ నివాసం ఉంటారని పలువురు కాలనీవాసులు అభిప్రాయపడ్డారు. ఆయా సమస్యలను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా.చిన్నారెడ్డి, కలెక్టర్ తేజస్‌నందులాల్ పవర్ దృష్టికి తీసుకెళ్లి వారిని కాలనీకి తీసుకొచ్చి స్వయంగా వారు సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారం కోసం తగు చర్యలు తీసుకునే విధంగా చూస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం



అమడబాకుల ప్రాథమిక పాఠశాలలో..

పాన్‌గల్: మండలంలోని దావాజిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి స్వయం పాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. డీఈఓగా మాధవచారి, ఎంఈఓగా సాయివిష్ణు, హెచ్ఎంగా రాధికతో పాటు 32 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బద్రూనాయక్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పెబ్బేర్ రూరల్: మండలంలోని తాటిపాముల ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం స్వయం పాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓగా హారిక, హెచ్ఎంగా ధరణికుమార్‌తో పాటు 31 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాంచంద్రయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములుయాదవ్, సింగిల్ విండో డైరెక్టర్ వాసుదేవరెడ్డి, కుర్మన్న, సత్యనారాయణయాదవ్, ఎల్లస్వామి, మద్దిలేటి, ఉషన్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: మండలంలోని భూత్కూర్ ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓగా పూజ, హెచ్ఎంగా సంగీతతో పాటు మరో 16మంది విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్ఎం అమరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు మాధవి, ఆనంద్ తదితరులు ఉన్నారు.

అమడబాకుల ప్రాథమిక పాఠశాలలో..

అమడబాకుల ప్రాథమిక పాఠశాలలో డీఈఓగా గౌతమ్, ఎంఈఓగా నరేందర్, హెచ్ఎంగా యుగేందర్, పీఈటీగా శ్రీవల్లి, అటెండర్‌గా రామ్‌చరణ్‌తో పాటు 14మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన దివ్యశ్రీకి ప్రథమ బహుమతి, శ్రీవల్లికి ద్వితీయ బహుమతి, దివ్యకు తృతీయ బహుమతులను ఉమ్మడి మండలాల విద్యాధికారి కృష్ణయ్య అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సూర చంద్రశేఖర్, పలుస నరేందర్‌గౌడ్, శ్రీలత, లక్ష్మి, అరుణ తదితరులు ఉన్నారు.

అమరచింత: మండల కేంద్రంలోని విజేత ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు మంగళవారం స్వయంపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మోహన్, కరస్పాండెంట్ లక్ష్మీనారాయణలు తెలిపారు.



దావాజిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో..



తాటిపాములలో..

2 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీపనగండ్ల: మండలంలోని తూముకుంట వాగు సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని వాటి యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నందీకర్ తెలిపారు. బొల్లారం, తూముకుంటతండాకు చెందిన పాపయ్య, శత్రునాయక్ ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇసుకను తరలిస్తుండగా ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

కేంద్ర బలగాల కవాతు

పాన్‌గల్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా కేంద్ర సాయుధ బలగాలు స్థానిక పోలీసులతో కలిసి మంగళవారం సాయంత్రం మండల కేంద్రంలో ఫ్లాగ్‌మార్చ్ చేయించినట్లు ఎస్ఐ వేణు తెలిపారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి ఆయా గ్రామాల్లో పోలీసుల కవాతు నిర్వహిస్తామన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండలంలో ఎన్నికలు సజావుగా సాగేందుకు మండల ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రజల రక్షణే పోలీసుల కర్తవ్యం

వనపర్తి (ఖిల్లాఘనపురం): విధుల్లో పోలీసు సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలని కొత్తకోట సీఐ రాంబాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఆయన ఎస్ఐ శ్రీహరితో పాటుగా సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉందని తెలిపారు. త్వరలోనే పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉన్న నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు ముందుండాలని సూచించారు. కొన్ని సందర్భాల్లో చిన్నపాటి గొడవలు కూడా పెద్ద సమస్యలను సృష్టించడానికి అవకాశం ఉందన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారికి న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ప్రజల ఇబ్బందులను పోలీసులకు ధైర్యంగా చెప్పుకునే వాతావరణాన్ని కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సత్యంగౌడ్, బొట్టు శ్రీను, మునిస్వామి, బద్రునాయక్, శ్రీను, రాజు పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో పరమేశ్వరస్వామి జాతర



ఆత్మకూర్: పట్టణ శివారులోని చెరవు మధ్యలో వెలసిన పరమేశ్వరస్వామి జాతరలో భాగంగా మంగళవారం రాత్రి భక్తిశ్రద్ధలతో పూజలు, రెండో రథోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం చేసి ఉత్సవమూర్తి విగ్రహాలను ఆలయంలోని శివలింగంపై అలంకరించారు. వందలాది మంది భక్తులు బక్షాలు, పచ్చి పులుసు, అన్నాన్ని స్వామివారికి నైవేద్యంగా సమర్పించి దాసంగాలు పెట్టారు. అనంతరం ప్రముఖ పూజారులు కర్పసయ్య ఆధ్వర్యంలో జాతర కమిటీ కన్వీనర్ రవికుమార్‌యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు చెన్నయ్య, మండ్లరామకృష్ణ, పోషన్న, అశ్విన్‌కుమార్, మహేశ్వరి, నాగలక్ష్మి, యాదమ్మ, తబస్సుం ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాత్రి వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి మొదలుకొని పట్టణంలోని పుర వీధుల గుండా స్వామివారికి మేళతాళాలతో పల్లకీసేవ, అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం రాత్రి తేరు సందర్భంగా ప్రత్యేక పూజలు, ఇతర కార్యక్రమాలు చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అంగన్‌వాడీల కలెక్టరేట్ ముట్టడి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు

పెబ్బేరు రూరల్: కొన్నేళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్స్‌కు కచ్చిత వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండలాల అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ ఉద్యోగులను దొంగలుగా చిత్రీకరిస్తూ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ యంత్రాలు ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఇదివరకు ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్లు పనిచేయడం లేదని, వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ల్యాప్‌ట్యాప్‌లు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలతో సమానంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవిలో ఒంటిపూట, మే నెలలో వేసవి సెలవులు ఇవ్వాలన్నారు. 24 రోజుల సమ్మె కాలానికి సంబంధించిన వేతనాలు చెల్లించాలని, పాత పద్ధతి మాదిరిగా హెల్పర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు నిక్సన్, అంగన్‌వాడీ టీచర్ల సంఘం అధ్యక్షురాలు శారద, జిల్లా కార్యదర్శి నారాయణమ్మ, జిల్లా ఉపాధ్యక్షురాలు కవిత, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు జ్యోతి, సుమతి, నాగేంద్రమ్మ, సంధ్యారాణి, వెంకటేశ్వరమ్మ, గోవిందమ్మ, కవిత, సుగుణబాయి, శారద, రామచంద్రమ్మ, అరుణ, విజయ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి



ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానిస్తున్న కల్వరాల గ్రామ ఉద్యోగులు

వీపనగండ్ల: మండలంలోని కల్వరాలకు చెందిన 13 మంది యువతకు ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన వివిధ నోటిఫికేషన్ల ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించడంపై మంగళవారం గ్రామ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు. లెక్చరర్ పోస్టులు, టీచర్లు, స్టాఫ్ నర్స్‌లు తదితర పోస్టుల్లో తమ గ్రామానికి చెందిన వారు ఉద్యోగాలు సంపాదించడం హర్షించదగ్గ విషయమని ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శంకరయ్య, ఈశ్వర్ అన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులు వీరిని స్ఫూర్తిగా తీసుకొని మంచి ఫలితాలు సాధించాలని పరీక్ష మెటీరియల్‌ను అందజేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కుష్ఠు నిర్ధారణ సర్వే



పాన్‌గల్‌లో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది



నెల్విడిలో..

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో కుష్ఠు వ్యాధిగ్రస్తుల ఇంటింటి సర్వే మండలంలో కొనసాగుతున్నట్లు పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు అన్నారం, శాగాపూర్ గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి వివరాలను సేకరించాలని సూచించారు. సర్వే ఈనెల 24వ తేదీ వరకు కొనసాగుతుందని, లక్షణాలు ఉన్నవారు వైద్యులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో రాంచందర్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మదనాపురం: మండలంలోని నెలివిడిలో మంగళవారం క్షయ వ్యాధి నివారణపై జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ వంశీకృష్ణ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ టీబీ వ్యాధి లక్షణాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. గ్రామంలో టీబీ వ్యాధిగ్రస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ భవని, సూపర్‌వైజర్ ప్రమీల, హెల్త్ అసిస్టెంట్ సురేష్, ఏఎన్ఎం చంద్రమ్మ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ పాలనపైనే ప్రజలకు నమ్మకం



ఆత్మకూర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న బీజేపీ నాయకులు

కొత్తకోట (ఆత్మకూర్): ప్రజలకు ప్రధాని మోదీ పాలనపైనే నమ్మకం ఉందని, ఆయనతోనే దేశాభివృద్ధి సాధ్యమని భారతీయ జనతా పార్టీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆత్మకూర్ నుంచి కార్యకర్తలతో కలిసి హైదాబాద్‌లో నిర్వహించిన అమిత్‌షా సభకు తరలివెళ్లారు. కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రంలో రూ.15 వేల కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు మరికొన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపే ధ్యేయంగా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తమ్మలి విజయ్, ఆనంద్‌కుమార్, బాలకృష్ణ, చిన్ననర్సింహ, రేచింతల శ్రీను, రాజు, ఎల్లన్న, బాలు, వెంకట్రాములు, విష్ణువర్ధన్‌రెడ్డి, సూరి, అశోక్, చందు, శ్యాం, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

అమరచింత: హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన బీజేపీ బూత్ అధ్యక్షుల సమావేశంలో పాల్గొనేందుకు బీజేపీ మండల నాయకులు ప్రత్యేక వాహనాల్లో హైదరాబాద్‌కు తరలివెళ్లారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు, పట్టణ అధ్యక్షుడు క్యామ భాస్కర్, వెంకటేశ్వర్లు, హరీశ్, రాజేష్‌శెట్టి, మేర్వ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో తాగునీటి ఎద్దడి రాకుండా తగు చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మీకుమార్, తండా ప్రత్యేక అధికారి విద్యాసాగర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తండావాసులతో కలిసి తండాలో పర్యటించారు. తండాలో ఉన్న మిషన్ భగీరథ నీటి ట్యాంకు నీటి సరఫరా లేక తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని తండావాసులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. రెండు, మూడు రోజుల్లో నీటి ట్యాంకుకు నీటి సరఫరా చేసి ఇబ్బందులు లేకుండా చూస్తామని అధికారులు తండావాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్మద, గిరిజన సంఘం జిల్లా నాయకులు బాలునాయక్, రాజునాయక్, రవితేజనాయక్ పాల్గొన్నారు.

ఇబ్బందులు తొలగించండి

చిన్నంబావి: మండలంలోని చిన్నమారు, పెద్దమారు, గూడెం గ్రామాల్లో ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు జగ్గారి శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి ప్రారంభానికి ముందే తాగునీటి ఇబ్బందులు ఆయా గ్రామాల్లో తలెత్తుతాయని ఉన్నతాధికారులకు మొరపెట్టినా.. ఇప్పటివరకు సమస్యను పరిష్కారం చూపడం లేదని మండిపడ్డారు. ఆయా గ్రామాల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్ సైతం అసంపూర్తిగా ఉండడం ప్రధాన కారణం కావడంతో ఆ సమస్యకు పరిష్కారం చూపాలని అధికారులను కోరిన లాభం లేదన్నారు.